# నేనూ పాపనైపోతాను

చీఫ్ మేనేజరు గదిలోనుండి బయటకు వచ్చిన సంధ్య ముఖం సంతోషంతో వెలిగిపోతోంది. ఆమె పెదవులపై చిరునవ్వు నర్తిస్తోంది. చేతిలో వున్న పుష్పగుచ్ఛాన్ని చెంపలకాన్చుకుని కళ్ళు మూసుకుంది సంధ్య.

'ఈ ప్రాజెక్టు విజయవంతం చేయడం కోసం ఎంత శ్రమపడింది తను. ఇంచుమించు రెండు నెలలుగా రాత్రింబవళ్ళు కష్టపడింది. తనకు వేళకు తిండీ, నిద్రా లేకపోవడం అటుంచి, పిల్లల్ని కూడా పట్టించుకోకుండా పనిచేసింది.

ఈరోజు బాస్‌తో ముఖాముఖి ఇంటర్వ్యూలో ఆయననుండి ఎటువంటి స్పందన వస్తుందోనని ఎంతో ఒత్తిడికి లోనైంది. ఆయన నోటివెంట ప్రశంస రావడమనేది చాలా అరుదుగా జరుగుతుందని ఆయన క్రింద పనిచేసేవాళ్ళందరూ అనుకుంటారు. అటువంటిది ఈరోజు తను ఆయన ఛేంబర్‌లోకి వెళ్ళగానే చిరునవ్వుతో తనను ఆహ్వానిస్తూనే "కంగ్రాట్స్ సంధ్యా! యు హావ్ డన్ ఏన్ ఎక్సలెంట్ జాబ్.." అంటూ పుష్పగుచ్ఛం అందించారు. పై నెలలో తనకు ప్రమోషన్ ఇవ్వాలని రికమెండ్ చేస్తున్నట్టు చెప్పారు. తన ఉద్యోగ జీవితంలో ఇదొక ఘనవిజయం'.

లిఫ్ట్‌లో క్రిందకు దిగి, తన గదివైపు నడుస్తున్న సంధ్య సెల్‌ఫోను తీసి కిరణ్‌కి ఫోను చేసింది. అతనితో ఈ శుభవార్త పంచుకోవాలన్న ఆరాటం ఆమెను నిలువ నీయడం లేదు.

"ఎప్పుడూ ఆఫీసు టైములో ఫోను చెయ్యనిదానివి ఈ వేళప్పుడు పిలిచావేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు కిరణ్.

"కిరణ్ ... రెండు నెలల నా శ్రమ ఫలించింది. మా చీఫ్ కంగ్రాట్స్ చెప్పి బొకే కూడా ఇచ్చారు. పై నెలలో నాకు ప్రమోషన్ వచ్చేట్టు చూస్తానన్నారు. ఆయామ్ సో హ్యాపీ" ఉద్వేగంతో చెప్పింది సంధ్య.

"కంగ్రాట్స్, సో... నన్ను దాటి ఒక అడుగు పైన వుంటావన్నమాట. నీక్కావలసింది అదేగా.. ఒ.కె. పాప జలుబు తగ్గిందా? పావని స్కూలుకు వెళ్తోంది కదా!" అని అడిగి జవాబుకోసం చూడకుండానే ఫోను కట్ చేశాడు కిరణ్. సంధ్య ముఖం చిన్నబోయింది. తన విజయాన్ని అతని విజయంగా భావించి సంతోషిస్తాడను

కుంది. కానీ అతను తామిద్దరూ పోటీదారులైనట్టు, తను పైమెట్టు ఎక్కితే అతను ఓడిపోయినట్టు ఎందుకనుకుంటున్నాడు?

ఆనందమంతా ఆవిరైపోగా నిరాసక్తంగా నడుస్తూ తన గదిలోకి వచ్చింది సంధ్య. కంప్యూటర్‌లో స్క్రీన్ సేవర్‌గా వున్న పాప నవ్వు ముఖం చూసేసరికి సంధ్య మనసు కొంత శాంతపడింది. కిరణ్ సంగతి తెలిసిన విషయమే అయినా ఆలోచనలు ముసురుతూనే వున్నాయి సంధ్యను. భోజన విరామసమయంలో ఏమీ తినాలనిపించక కాఫీ తెప్పి,చుకుంది. సెల్ మోగితే కిరణ్ చేసాడేమో అన్న ఊహతో ఎగసిపడుతున్న ఆశతో 'హలో' అంది నంబరు కూడా చూడకుండా.

"హలో ... నేను 'బాలవిహార్' ప్రిన్సిపాల్ శశికళను మాట్లాడుతున్నాను మేడమ్. మీరొకసారి స్కూలుకి రాగలరా? మీ పావని ఒక పాపని నెత్తురొచ్చేలా కొట్టింది. ఆ పాప పేరెంట్స్ గొడవ చేస్తున్నారు. ప్లీజ్ ఒకసారి రండి" అని చెప్పి కట్ చేసిందామె.

ఒక నిమిషం పాటు నిస్సత్తువగా కూర్చుండిపోయింది సంధ్య. ఆమెకెందుకో హఠాత్తుగా కిరణ్‌మీద కోపం ముంచుకొచ్చింది. పెళ్ళై ఆరేళ్ళయింది. ఈ రోజుకీ అతను నెలకోసారి వచ్చిపోయే అతిథి దేవుడే. భర్త అంటే భరించేవాడుట. ఏం భరిస్తున్నాడు? పిల్లలకి గానీ, తనకి గానీ ఏ అవసరం వచ్చినా తను చూసుకోవలసిందే. ఈ విషయంగా ఎప్పుడైనా వాదన వస్తే "నీకు అన్నిటికన్నా నీ ఉద్యోగం ముఖ్యం అని అన్నావు కదా" అంటూ తప్పు తనమీదే మోపుతాడు. అతనికి తన కెరియర్ ఎంత ముఖ్యమో నాకు నా ఉద్యోగం అంత ముఖ్యమని ఎందుకు గ్రహించడు? ఈ సీనియారిటీ, పరపతి, గౌరవం అన్నీ వదలుకుని అతనున్న చోటికి వెళ్ళి పోవాలి. అంతగా కావాలంటే మళ్ళీ మరో ఉద్యోగం చూసుకోవచ్చుట. అంటే నిచ్చెన మొదటి మెట్టుమీద నుండి అనామకురాలిగా ఎక్కడం మొదలు పెట్టాలి. అతను ఉద్యోగం చేసే కంపెనీ బ్రాంచ్ ఇక్కడ వుంది. కానీ ఇగో ప్రాబ్లమ్... ఆవేశాన్ని అదుపు చేసుకుంటూ లేచి హ్యాండ్ బ్యాగు తీసుకుని బయల్దేరింది సంధ్య.

ప్రిన్సిపాల్‌తో మాట్లాడి, దెబ్బ తగిలిన పాప వాళ్ళ తల్లిదండ్రులకు తన కూతురి తరుపున క్షమాపణలు చెప్పి పరిస్థితిని చక్కదిద్దింది.

"పాపకు ఎంత దెబ్బ తగిలిందో చూడు. అలా కొట్టడం తప్పుకదూ... సారీ చెప్పు" అంటూ నాలుగేళ్ళ పావనిని గద్దించింది. తల్లివైపు ఒకసారి చూసి, కళ్ళు వాల్చుకుని మొండిగా నిలబడిందే తప్ప సారీ చెప్పలేదు పావని.

గొడవ సద్దుమణిగాక, పాపని క్లాసుకు పంపించేసి సంధ్యతో అన్నది ప్రిన్సిపాల్. "ఈ మధ్యన పావని చాలా మొండితనం నేర్చుకుంది మేడమ్, చెప్తే వినదు. పక్కనున్న పిల్లలని గిచ్చడం, వాళ్ళ బొమ్మలు విరగ్గొట్టడం వంటి అల్లరి ఎక్కువైంది. మీరు కాస్త క్రమశిక్షణ నేర్పాలి" అని.

ఆవిడ మాటలు వింటుంటే అవమానంగా అనిపించి గభాలున కుర్చీలోనుండి లేచింది సంధ్య. “మా పిల్లలని ఎలా పెంచాలో మాకు తెలుసు. స్కూల్లో మీరు వాళ్ళను నియంత్రించి మంచి ప్రవర్తన నేర్పాలి” అనేసి బయటకు వచ్చి కారెక్కింది.

ఇక ఆఫీసుకు వెళ్ళబుద్ధికాక నేరుగా సరసిజ క్లినిక్‌కి బయల్దేరింది సంధ్య. మనసు విప్పి మాట్లాడుకోగల స్నేహం వారిది. కిరణ్‌కి వరసకు చెల్లెలవుతుంది.

సరసిజ ఖాళీగానే వుంది ఆసమయంలో. సంధ్యను చూడగానే ఆత్మీయంగా ఆహ్వానించింది.

“ఎప్పుడు పిలిచినా పని ఎక్కువగా వుంది. ఇంకోసారి వస్తాలే అనే దానివి నా మీద ఇంత దయ కలిగిందేం?” అంటూ చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకువెళ్ళింది.

“ఇవాళ నాకెంతో సంతోషకరమైన రోజు అనుకున్నాను. నా ప్రాజెక్టు ఘనవిజయం. రాబోయే ప్రమోషను వార్త తెచ్చిన ఉత్సాహమంతా మీ అన్న, ఆయన ముద్దుల కూతురు నాశనం చేసేసారు” అంది సంధ్య ఉక్రోషంగా.

నిదానంగా సంధ్య నుండి విషయం రాబట్టింది సరసిజ. ఎంతైనా ఆమె మనసులు కుదుటపరచే వృత్తిలో వుంది. “నాకు తెలిసి పావని చాలా మెతకపిల్ల. ఎప్పటినుండి ఇలా వస్తువులు విసరడం, కొట్టడం లాటివి మొదలు పెట్టింది?” అనడిగింది.

“ఈ మధ్యనే సరసీ! అన్నిటికీ చెల్లాయితో పోటీ. పాపకు పాలు పడుతున్నప్పుడే తనకు తల దువ్వమంటుంది. అది నా ఒళ్ళో వున్నదంటే దీనికి అప్పుడే ఆకలి వేస్తుంది. నీళ్ళు పోసుకోడానికి మంకుతనం. టిఫిన్ తినమంటే వద్దని మారాం. ప్రాణం తీసేస్తోంది. అతనికేం మగమహారాజు హాయిగా ఏ బాధ్యతలు లేకుండా సుఖంగా వున్నాడు. వీళ్ళిద్దరితో నేను నలిగి పోతున్నాను”.. ఆవేశంగా చెప్తున్న సంధ్య హఠాత్తుగా రెండు చేతుల్లో ముఖం దాచుకుంది. “జీవితమంటే ఈ పరుగు పందెమేనా అని విరక్తి పుడుతోంది సరసీ! ఈ కష్టపడడం, సంపాదించడం, పిల్లల పెంపకం ఇంతేనా బ్రతుకు? ఎవరి సంతోషం కోసమని? పెళ్ళికాక మునుపు విద్యార్థినిగా అమ్మా నాన్నల దగ్గర హాయిగా వున్న రోజుల్లోకి వెళ్ళిపోతే బాగుండునని పిస్తోంది” జీరబోయిన గొంతుతో అంది.

ఓదార్పుగా సంధ్య తలనిమిరింది సరసిజ. “మీ ఇద్దరూ చెరొకచోట వుండడం వలన నీకు పని ఒత్తిడి పెరిగింది సంధ్యా. మన చదువుకు ప్రతిభకు తగిన ఉద్యోగం, గుర్తింపు, సంపాదన కావాలనుకున్నప్పుడు కొన్ని విషయాలలో సర్దుకుపోక తప్పదు కదా సంధ్యా!” అంది నెమ్మదిగా.

“ఆ సర్దుకుపోవడం అన్నది ఎప్పుడూ ఆడవాళ్ళవైపునుండే జరగాలనుకుంటా రెందుకని? ఇద్దరం సమానంగా చదువుకున్నాం. ఉన్నత పదవుల్లో వున్నాం. నాకోసం అతను తన ఉద్యోగం, సీనియారిటీ పోగొట్టుకోడు. నేను ఇవన్నీ వదలుకొని వెళ్ళలేదు గనుక తప్పు నాదే అంటాడు” నిర్వేదంగా అంది సంధ్య.

"పావనిని అమ్మ దగ్గర హిందూపురంలో వదలి పెడతానంటే ససేమిరా అన్నాడు. రెండోది పుట్టాక అది మొండితనం నేర్చుకుని నా ప్రాణం తీస్తోంది. రాత్రి నిద్ర లేకపోయినా ప్రొద్దున్నే లేచి పావని కోసం ఇష్టమైనవి చేసిపెట్టి, స్కూలుకి తీసికెళ్ళి వదలడం, మళ్లీ సాయంత్రం తీసుకువచ్చాక నీళ్ళుపోసి తిండి పెట్టి, హోమ్‌వర్క్ చేయించి అన్నీ చేసేది నేను. గానీ దానికి మాత్రం వాళ్ళనాన్నే ప్రాణం..." ఉక్రోషంగా చెప్తున్న సంధ్యను చూసి చిన్నగా నవ్వింది సరసిజ.

"పాప నిన్నొదిలి పెట్టి క్షణముండదని చెప్పేదానివి కదా మరి నాన్న కూచిగా ఎప్పుడు మారింది?" అనడిగింది.

సాలోచనగా చూస్తూ కూర్చుండిపోయింది సంధ్య. "నిజమే, పావని ముందు ఇలా వుండేది కాదు. కిరణ్ ఎప్పుడో ఒకసారి వచ్చి వెళ్తే సులభంగా "టా టా" అని చెప్పేది. ఈ మధ్యనే ఎందుకో అతను వచ్చినప్పుడు వదలకుండా అల్లుకుపోతోంది.

పదిహేను రోజుల క్రిందట కిరణ్ శని, ఆదివారాల్లో వచ్చి వెళ్లాడు. అతను బయల్దేరి వెళ్తున్నప్పుడు మొదలు పెట్టిన ఏడుపు రెండు గంటలు దాకా ఆపలేదు పావని. "నాన్నకావాలి" అన్న ఒక్క ముక్క పదే పదే అంటూ, వెక్కిళ్ళు పెట్టి ఏడ్చింది. చివరికి "ఇంట్లోకి రానివ్వను" అంటూ బయట పెట్టి తలుపువేసేస్తే ఏడుపు ఆపింది.

ఈ మధ్యనే ప్రతిదానికీ పేచీ పెట్టడం మొదలు పెట్టింది. చిన్నపాపకు ఏ బొమ్మ ఇస్తే అదే తనకీ కావాలని లాక్కుంటుంది. దానికి సీసాలో పాలుపడితే నాలుగేళ్ళ పిల్ల తనకూ సీసాలో పాలు కావాలంటుంది. ఇప్పుడు కొత్తగా బడిలో పిల్లల్ని కొట్టడం మొదలు పెట్టింది"

"ఈ మధ్యనే ఇలా తయారయింది సరసీ! అన్నింటికీ పాపతో పోటీ... పెంకితనం ఎక్కువయింది. రోజల్లా ఆఫీసులో పనిచేసి అలసి పోయి ఇంటికి వస్తానా, ఇద్దర్నీ సముదాయించడం నా వల్ల కావడం లేదు" అంది సంధ్య నిస్సహాయంగా.

"ఇంట్లో అమ్మమ్మగానీ నాయనమ్మగానీ వున్నా లేక కిరణ్ నువ్వు ఒకచోటే వున్నా పావని ఇలా తయారయ్యేది కాదేమో సంధ్యా. మనం సహజంగా చిన్నపిల్లల గురించి ఎక్కువ పట్టించుకుంటాం. ముద్దు చేస్తాం. చెల్లాయి వచ్చాక నువ్వు తనని పట్టించుకోవడం లేదన్న భావం కలిగి నీ అటెన్షన్ కోసం ఇలా మొండి చేస్తోందేమో పావని" అంది సరసిజ.

"పాప మాటెత్తితే గుర్తొచ్చింది. ఇవాళ దానికి పోలియో చుక్కలు వేయించాలి. నేను వెళ్తాను" అంటూ లేచింది సంధ్య.

క్రెష్ నుండి పాపను తీసుకుని, స్కూలునుండి పావనిని పిల్చుకుని సంధ్య ఇల్లు చేరేసరికి ఆరయ్యింది. ఆ సరికి సంధ్య రాకకోసం ఎదురుచూస్తోంది పనిపిల్ల ఉష.

తాళం తీసి లోపలికి రాగానే గీజరు ఆన్ చేసి పాపకు స్నానం చేయించింది సంధ్య.

"ఉషా పావనికి నీళ్ళు పొయ్యి" అంది పాపకు ఒళ్ళు తుడిచి పౌడరు వేస్తూ.

"నాకు నువ్వే నీళ్ళు పొయ్యమ్మా... పాపను ఉషకు ఇచ్చేయ్" అంటూ మారాం మొదలుపెట్టింది పావని.

ఇంటికొచ్చి కప్పుకాఫీ అయినా త్రాగకుండా పిల్లల సేవలో పడిన సంధ్యకు నీరసం మీద కోపం వచ్చింది.

"నోరు మూసుకుని స్నానం చేసిరా..." అంటూ కసిరింది. పావని వచ్చేసరికి నూడుల్స్ తయారుచేసి పెట్టింది.

"గబగబ తినేసి హోమ్‌వర్క మొదలుపెట్టు" అంటూ నూడుల్స్ వున్న ప్లేటు పావని ముందు పెట్టి, పాపను ఒళ్ళో వేసుకుని పాలు పట్టసాగింది సంధ్య. సీసాలో పాలను ఆకలితో తాగుతున్న పాపాయిని వంగి ముద్దుపెట్టుకుని "తిన్నావా" అంటూ పావనిని హెచ్చరించింది. ప్లేటును ఒక్క తోపు త్రోసింది పావని. " నాకు నువ్వే తినిపించు" అంది లేచి వచ్చి తల్లి వీపుమీద జారబడుతూ. నోట్లోని సీసా కదిలి పాప కెవ్వున ఏడుపు మొదలుపెట్టింది.

పిచ్చికోపంతో పావని జబ్బ పట్టుకుని లాగి దూరంగా నెట్టేస్తూ "మొండి చేసావంటే దెబ్బలు పడతాయి. వెళ్ళి తిను." అనేసి పాపాయిని సముదాయించడంలో పడింది సంధ్య. తల్లి కోపానికి బెదిరిన పావని వెళ్ళి ప్లేటు ముందు కూర్చుంది.

'నేనేమో ఇంటికొచ్చినప్పటి నుండి వీళ్ళిద్దరితో సతమతమవుతుంటే ఈ మహారాజు హాయిగా ఈ టైముకు స్నేహితులతో కలిసి 'ఈటరీ' మీద పడివుంటాడు. కంపెనీ ఇస్తుందిగా నెలకు నాలుగువేల దాకా ఫుడ్ అలవెన్స్. రోజుకో హోటల్‌కి వెళ్ళొచ్చు' కిరణ్‌ని తలచుకుని చిరాకుపడింది సంధ్య.

ఉషను ఇంట్లోనే వుండమని పాపను దగ్గరే వున్న డాక్టర్ దగ్గరికి తీసుకెళ్ళి వచ్చిందామె. పాప నిద్ర పోయాక పావనిని హోమ్‌వర్క్ పుస్తకం ముందు కూర్చోబెట్టింది.

ముందురోజు హోమ్‌వర్కు పూర్తిగా చేయలేదని పావని టీచరు రాసిన నోట్ చూసింది. ఒకటి నుండి నూరు వరకు రాయమని పావనికి చెప్పి ఏదో పనిలో పడి చూడ్డం మరిచి పోయిందితను. 'రాసేసానమ్మా' అని పుస్తకం మూసిపెట్టి పడుకుంది పావని. అది గుర్తొచ్చి "అబద్ధాలు చెప్పడం కూడా నేర్చుకున్నావా?" అంటూ పావని బుగ్గపిండి, "ఏ నుండి జడ్ దాకా పదాలు రాయి. మధ్యలో వదిలేస్తే వూరుకోను" అంది పుస్తకం పెన్సిలు చేతికిస్తూ.

'తనకి అయిదేళ్ళకి అక్షరాభ్యాసం చేసార్ట. ఇప్పుడు నాలుగేళ్ళకే ఎన్నెన్నో నేర్చేసుకోవాలని నూరిపోస్తున్నారు' అనుకుంటూ ఇంకో పుస్తకం తీసింది. అందులో 'ఐ

డోంట్  టాక్ తెలుగు' అంటూ యాభైసార్లు రాసివుండటం కనబడింది. "ఇవెందుకు రాసావు?" కూతురికి చూపించి అడిగింది సంధ్య ఆశ్చర్యంగా.

"టీచరుకు తెలుగులో రేపు చేస్తాను టీచర్ అని చెప్పినందుకు పనిష్మెంటిచ్చిందమ్మా" అంది పావని బిక్కమొహం పెట్టి, సంధ్యకు పావనిని తిట్టాలో, టీచర్ని అడగాలో అర్థంకాక నిట్టూర్చి వూరుకుంది.

మరుసటి వారాంతపు సెలవుల్లో కిరణ్ వచ్చాడు. ఆదివారం నాడు సరసిజను భోజనానికి పిలిచింది సంధ్య. సరసిజ అత్తయ్య, భర్త, పిల్లలు వరంగల్‌కి వెళ్ళారని తను ఒంటరిగా వుందని అదే పనిగా ఆహ్వానించింది.

భోజనాలయ్యాక నలుగురు కూర్చుని వున్నప్పుడు పాప గురించి ముచ్చట్లు చెబుతోంది సంధ్య.

"దీనికి తొమ్మిది నెలలకే నడక వచ్చేసింది చూసావా? సోఫాలు పట్టుకుని ఆ చివరిదాకా వెళ్ళిపోతుంది" అంటూ చిన్న కూతుర్ని క్రిందకు దింపింది సంధ్య. పాప సోఫా అంచులు పట్టుకుని బుడి బుడి అడుగులు వేస్తోంది.

"ఆంటీ నేనైతే జంప్ చేస్తాను. పాపకు రాదు" అంటూ తను కూర్చున్న చోటునుండి లేచి రెండు కాళ్ళతో ముందుకు ఎగురుతూ వచ్చింది పావని. ఆ రావడంలో బ్యాలెన్సు తప్పి బోర్లాపడి మూతికి గట్టిగా దెబ్బ తగిలి పెద్దగా రాగం మొదలు పెట్టింది.

"ఒక చోట కుదురుగా వుండవు కదా. ముందు ఏడుపాపు" అని కసురుకున్న సంధ్య చిన్నపాప పడిపోబోతుంటే గభాలున పట్టుకుని ఎత్తుకుని పైకి ఎగురవేసి పట్టుకుని ముద్దులు పెట్టి – "నీ కప్పుడే నడిచేయాలని తొందరెందుకే..." అంటూ పాపను హత్తుకొంది.

చిన్నబోయిన ముఖంతో కూర్చున్న పావని "అమ్మా" అంది ఏదో చెప్పాలని. సంధ్య పలకక పోవడంతో మళ్ళీ రెండుసార్లు "అమ్మా" అని పిలవడంతో సంధ్య విసుగ్గా "ఎందుకే అమ్మా అమ్మా అంటూ అరుస్తారు? నోరు మూసుకుని కాసేపు కూర్చోలేవా?" అని గదిమింది.

సరిగ్గా అదే సమయంలో చిలకలాగా అక్క పలుకును తిరిగి అనుసరిస్తూ 'అమ్మా' అంది చిన్నపాప.

"నా బంగారు తల్లికి 'అమ్మా' అనడం వచ్చేసిందే! కిరణ్ పాప 'అమ్మా' అంది విన్నావా? సరసీ! దీనికి మాటలు కూడా తొందరగా వస్తాయని అన్నానా?" అంటూ పాప బుగ్గల మీద ముద్దుల వర్షం కురిపించింది సంధ్య.

"ఏదీ మళ్ళీ అనరా.. అమ్మా అను..." సంధ్య చేతినుండి పాపను తీసుకుని ముద్దు పెట్టుకున్నాడు కిరణ్.

"అమ్మా" మళ్ళీ పిలిచింది పావని.

"వుండవే ... విసిగించకు రేపటి హోమ్ వర్క్ చేసుకో కూర్చుని" అని కసిరిన సంధ్య పాపను ఒళ్ళోకి తీసుకుంటూ "అమ్మా అను. మళ్ళీ అనరా.." అంటూ ముద్దు చేస్తోంది.

హఠాత్తుగా పావని తండ్రి దగ్గరకు వచ్చి "నాన్నా నేనూ పాపనైపోతా" అంది ఏడుపు గొంతుతో.

"ఏమిటా పిచ్చిమాటలు. ఆంటీ నవ్వుతుంది" అన్నాడు కిరణ్ సముదాయిస్తున్నట్టు.

పావని ఏడుపు ఆపలేదు సరికదా ఎక్కువ చేసింది.

"నేనూ పాపనైపోతాను అమ్మా..." అంటూ గుక్కపెట్టి ఏడవటం మొదలు పెట్టింది.

పెద్దవాళ్ళు ముగ్గురూ ఏమీ తోచనట్టు ఒకరి ముఖం మరొకరు చూసుకున్నారు.

సరసిజ పావనిని ఎత్తుకుని బయటకు తీసుకు వెళ్లింది. అరగంట తరువాత వాళ్ళిద్దరూ తిరిగి వచ్చేసరికి పాప నిద్రపోయింది. పావని ఆంటీ కొనిచ్చిన ఐస్ క్రీమ్ తింటూ, బొమ్మల పుస్తకం గట్టిగా పట్టుకుని వచ్చింది.

"నాన్నా ! పాపకు ఐస్‌క్రీము లేదు. బొమ్మల పుస్తకం లేదు. నేను పెద్ద పాపను గనుక నాకే కొనిచ్చిందే ఆంటీ.." అంది కిరణ్ ఒళ్ళోకి ఎక్కి కూర్చుంటూ.

దీర్ఘాలోచనలో పడిపోయిన సంధ్య భుజం తట్టింది సరసిజ. "మొన్న నువ్వు ప్రాజెక్టువర్క్‌తో, ఇంట్లో పిల్లలతో నలిగిపోయినప్పుడు కిరణ్ కూడా దగ్గర లేకపోవడంతో 'ఎందుకొచ్చిన పరుగుల జీవితం? హాయిగా చదువుకునే రోజుల్లోకి వెళ్ళిపోతే బాగుండును' అనలేదూ? పావనికూడా స్కూల్లో ఆంక్షలు, చదువు, హోంవర్క్ ఒత్తిడికితోడు ఇంట్లో మీఇద్దరి ధ్యాస పాపమీదే వుండడం చూసి తట్టుకోలేకపోతోంది సంధ్య. మీ అటెంషన్ తన మీదకు మళ్ళాలనే ఆమెుండితనం, ఈ రోజు పాపనై పోతానని ఏడవడం వీటన్నిటికీ కారణం. ప్రస్తుతం పెద్దవాళ్ళేకాక నాలుగేళ్ళ పసిపిల్లలు కూడా విపరీతమైన ఒత్తిడికి లోనౌతున్నారు. ముందే జాగ్రత్త పడకపోతే డిప్రెషన్‌కు లోనుకావడం, ఇంట్రావర్ట్‌గా తయారవ్వడం జరుగవచ్చు" అంది సరసిజ.

ఆర్తిగా పావనిని దగ్గరకు తీసుకుంది సంధ్య.

"సంధ్యా నేను ఇక్కడే ఉద్యోగం చూసుకుంటాను. నీకు పిల్లలకు దగ్గరగా వుండడం కన్నా మరేదీ ముఖ్యం కాదు?" ఆర్ద్రంగా అన్నాడు కిరణ్.

"బావుంది. తొందరలో మీరందరూ కలిసి వుండబోతున్న శుభవార్తను ఐస్‌క్రీమ్ తింటూ సెలబ్రేట్ చేసుకుందాం" అంటూ వాళ్ళిద్దరి మనసులను తేలిక పరుస్తూ ఐస్‌క్రీమ్ కప్పులు అందించింది సరసిజ.

"కుటుంబం అంటే భార్య, భర్త పిల్లలు అనే చిన్న పరిధి ఏర్పరచుకున్నాం. కనీసం వీళ్ళమధ్యన స్నేహం, సాన్నిహిత్యం, ఒకరికిఒకరు అన్న ఆత్మీయత పెంచుకుంటే తప్ప వర్తమాన పరిస్థితులలో ఒత్తిడిని, శ్రమను భరిస్తూ సంతోషంగా జీవించడం సాధ్యం కాదు. సంధ్యా! కిరణ్ తొందరగానే ఈదిశగా నిర్ణయం తీసుకున్నాడు. నాకు సంతోషంగా వుంది" అంది తనే మళ్ళీ.

"ఈమాట డాక్టరుగా అంటున్నావా? మాహితురాలిగానా?" కిరణ్ నవ్వుతూ అడిగాడు.

"రెండూ అనుకో, భార్యాభర్తల నడుమ ఎక్కువ తక్కువలు 'ఇగో' క్లాషెస్ రాకుండా సర్దుకు పోవడం ఎంత అవసరమో పిల్లలకు మానసికమైన ఒత్తిడి, ఒంటరితనం, ప్రేమకోసం తపన వంటి పరిస్థితులు ఏర్పడకుండా కాపాడుకోవడం అంతే ముఖ్యం. మీ ఇద్దరికీ కంగ్రాట్స్. మంచి నిర్ణయం తీసుకున్నారు" అంది సరసిజ.

సంధ్య కిరణ్ భుజంమీద తలవాల్చి "నువ్వు నా దగ్గర వుంటే ప్రపంచాన్నే జయించేయ గలనన్నంత ధైర్యంగా వుంటుంది" అంది.

"నాకూ అంతేరా.." అంటూ సంధ్య భుజాల చుట్టూ చేయివేసి సరసిజ వైపు కృతజ్ఞతగా చూసాడు కిరణ్.

- ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక **17-6-2010**